క్లుప్తంగా..

పొలానికి వెళ్తూ వాగులో రైతు గల్లంతు



చిట్యాల: పొలానికి వెళ్తూ మండలంలోని వెంచరామి గ్రామ శివారు కుర్మపల్లికి చెందిన రైతు ఓద్యారపు మొగిలి మోరంచ వాగు దాటుతూ గల్లంతయ్యాడు. వెంచరామి శివారు కుర్మపల్లికి చెందిన మొగిలి, జంగా లక్ష్మయ్య, తోట లక్ష్మణ్, కెందా రాజయ్య కలిసి మోరంచ అవతల ఉన్న పొలాలను చూసేందుకు మంగళవారం ఉదయం వెళ్లారు. వాగు దాటుతుండగా.. మొగిలి ప్రమాదవశాత్తు నీట మునిగాడు. గమనించిన తోటి రైతులు అతడిని కాపాడేందుకు యత్నించగా.. మొగిలి అప్పటికే ప్రవాహంలో కొట్టుకుపోయాడు. విషయాన్ని సర్పంచ్ మల్లేశ్, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్‌కు తెలిపారు. దీంతో హుటాహుటిన పోలీస్ సిబ్బంది వెళ్లి గ్రామస్తుల సహకారంతో మోరంచ వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ అతడి ఆచూకీ తెలియరాలేదు. రాత్రి కావడంతో బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ స్టేషన్ ప్రారంభ పనుల పరిశీలన

టేకుమట్ల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం ఈనెల 25న ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం ఎస్సై చల్ల రాజు నూతన పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈసందర్భంగా పెయింటింగ్, ఫ్లోర్ లెవలింగ్, ప్లాంటేషన్, ట్రీగార్డుల ఏర్పాటును పర్యవేక్షించారు. అనంతరం సిబ్బందికి తగు సలహాలు సూచనలు అందించారు. ఆయన వెంట ఏఎస్సై ఇంతియాజుద్దీన్, సిబ్బంది సుమన్, మహేందర్, రాజు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్

భూపాలపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పరీక్షలు చేయించుకోవాలని 16వవార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భూపాలపల్లిలోని రాంనగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కాలనీలో నాలుగు రోజుల పాటు వైద్యులు కంటి పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు ఇవ్వడం జరుగుతుందని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

చిట్యాల: చిట్యాల నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన వేణుచందర్‌ను జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్‌ఎస్ మండల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. సీఐని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు ఆరెపల్లి మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ గణపతి, మండల కో–ఆప్షన్ సభ్యులు ఎండి రాజ్‌మహ్మద్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రత్నాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ఏరుకొండ రాజేందర్, మన్నెం శ్రీనివాస్, మడికొండ రవీందర్‌రావు, నాయకులు కట్కూరి నరేందర్, పాండ్రాల వీరస్వామి, దుప్పటి శ్రీనివాస్, గుండా రవీందర్, తదితరులు ఉన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

చిట్యాల: క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచ్ సిద్దంకి భాస్కర్ అన్నారు. ఈసందర్భంగా మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏఎన్‌ఎం లావణ్య ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

తెరపైకి గిరిజన, గిరిజనేతర సమస్య

- చట్టాలు ఉల్లంఘిస్తున్నారని నోటీసులు జారీ చేసిన రెవెన్యూ అధికారులు
- ఉద్యమానికి సిద్ధం: గిరిజనేతరులు



అంబేద్కర్ భవన్‌లో సమావేశమైన గిరిజనేతరులు(ఫైల్)



రైతుకు రెవెన్యూ అధికారులు జారీ చేసిన నోటీసు

మంగపేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజన, గిరిజనేతర రైతులకు ఏజెన్సీ ప్రాంతంలో తెలంగాణ మినరల్స్, మైన్స్, వాల్టా, 1/70 చట్టాల ఉల్లంఘనకు పాల్పడినట్లు పేర్కొంటూ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో కొంత కాలంగా లోలోపల నలుగుతున్న హైకోర్టులో పెండింగ్ ఉన్న మంగపేట మండలం షెడ్యూల్డు, నాన్ షెడ్యూల్డు సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం మంగపేట మండలంలో షెడ్యూల్డు ప్రాంతంగా పాలన సాగుతోంది. మండలంలో 1/70, ఎల్‌టీఆర్, పెసా చట్టాలు అమలులో ఉన్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులను గిరిజనేతరులు సంప్రదిస్తే మండలంలో ఏజెన్సీ చట్టాల నిబంధనల మేరకు 1969కు ముందు నుంచి ఇప్పటి వరకు పట్టాదారుగా ఉన్న వారి భూ సమస్యలు మాత్రమే పరిష్కారించడం కుదురుతుందని అధికారులు చెబుతున్నారు. పూర్వం నుంచి కలిసి మెలిసి ఉంటూ జీవనం సాగిస్తున్న గిరిజన, గిరిజనేతరులు ఆయా కుటుంబాల ఆర్థిక అవసరాల కోసం, సాగు భూములతో పాటు, ఇంటి స్థలాలకు భూమిని విక్రయిస్తూ ఆర్థిక అవసరాలను తీర్చుకుంటూ వస్తున్నారు. 2018 వరకు గిరిజనేతరుల భూములకు అప్పటి రెవెన్యూ అధికారులు భూసమస్యలను పరిష్కరించడమే కాకుండా నూతనంగా పట్టాలు చేశారు. రెండేళ్ల నుంచి గిరిజనేతరుల భూసమస్యలు పరిష్కరించకుండా నిలిపేయడంతో తమ పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోరాటానికి సిద్ధమవుతున్న గిరిజనేతరులు

మండలంలోని గిరిజనేతరులు వారి హక్కుల సాధన కోసం ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగానే మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధి గిరిజనేతరులు మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఈనెల 20న ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంగపేట మండలం షెడ్యూల్డు, నాన్‌షెడ్యూల్డు ఏరియా అనే అంశం హైకోర్టు పరిశీలనలో ఉండగా.. అధికారులు షెడ్యూల్డు ఏరియాగా ఎలా నిర్ధారించి పరిపాలన ఎలా సాగిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. గిరిజనేతరులకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమించేందుకు పోరాట కార్యాచరణను రూపొందిస్తున్నారు.

అధికారుల తీరును తప్పుబడుతున్నారు..

తమ ఇష్ట ప్రకారం క్రయ విక్రయాలు జరుగుతుంటే.. రెవెన్యూ అధికారులు ఏజెన్సీ చట్టాల నిబంధనలను అతిక్రమించారని నోటీసులు జారీ చేయడాన్ని గిరిజన గిరిజనేతరులు తప్పుబడుతున్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, రాజుపేట, మల్లూరు, మంగపేట గ్రామాలకు చెందిన కొందరు గిరిజన, గిరిజనేతరులు ఇటీవల సాగు భూములను కొన్నారు. అందులో మట్టి నింపి కొందరు ఇంటి నిర్మాణం చేపడుతుండగా.. కొందరు ఓపెన్ ప్లాట్లు చేశారు. ఈక్రమంలో రెవెన్యూ అధికారులు తెలంగాణ మైన్స్, మినరల్స్ యాక్టు 2015, నాలా చట్టం 2006, వాల్టా 2002, 1/70 చట్టాల నిబంధనలను ఉల్లంఘించి వ్యవసాయ భూమిని, వ్యవసాయేతర భూమిగా మార్చారని, ముందస్తుగా ఎలాంటి అనుమతులు లేకుండా చట్టాలను అతిక్రమించిన మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ఆయా భూములను కొనుగోలు చేసిన, అమ్మిన యజమానులకు నోటీసులు జారీ చేశారు.

ఇంత కాలం చట్టాలు గుర్తుకు రాలేదా?

మండలంలో 1/70 యాక్టు నిబంధనలకు విరుద్ధంగా కొన్నేళ్లుగా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వ్యవసాయేతర భూములుగా మార్చి నివాస గృహాలు, పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తుంటే రెవెన్యూ అధికారులు చట్టాలు గుర్తుకు రాలేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ పరిసరాల్లో సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి భవనాలను నిర్మించుకున్నారని, కూత వేటు దూరంలోని గంపోనిగూడెంలో చెరువును కబ్జా చేసి ప్లాట్లుగా అమ్ముకున్న వారికి చట్టం వర్తించదా? అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చిన వాటికి రైతుబంధు డబ్బులు సైతం పడుతున్నాయని.. అయినా అధికారులకు సోయి లేదా? అని ప్రజలు మండిపడుతున్నారు.

పెరిగిన భూముల ధరలు

మండలంలోని కమలాపురం మొదలుకొని జిల్లా సరిహద్దు గ్రామం బ్రాహ్మణపల్లి వరకు ఉన్న మంగపేట, మల్లూరు, రాజుపేట, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో వ్యాపార వాణిజ్య సంస్థల కార్యకలాపాలు విస్తృతంగా సాగుతున్నాయి. ఆయా గ్రామాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. మండలంలో 1/70 యాక్టు అమలులో ఉన్నప్పటికీ ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆయా గ్రామాల్లో భూముల క్రయవిక్రయాలు పూర్వం నుంచి యథావిధిగా జరుగుతున్నాయి. రవాణా సౌకర్యం ఉండడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న సాగు భూములను కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం, వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు వారి సముదాయాలు నెలకొల్పేందుకు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. దీంతో గడిచిన మూడేళ్లలో ధరలు అమాంతం పెరిగాయి.

ఫిర్యాదు మేరకే నోటీసులు

ఏజెన్సీ ప్రాంతంలో ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూమిగా మార్చి ప్లాట్లు చేస్తున్నారని ఫిర్యాదు చేసిన వారికే నోటీసులు జారీ చేశాం. కావాలని ఎవరికీ నోటీసులు జారీ చేయలేదు. చట్ట ప్రకారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– మల్లేశ్వర్‌రావు,
డిప్యూటీ తహసీల్దార్ మంగపేట

చెక్‌బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి జైలు

ములుగు: చెక్ బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఆర్నెళ్ల జైలు శిక్ష, రూ.15 లక్షలు జరిమానా విధిస్తూ ములుగు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రామమోహన్‌రెడ్డి మంగళవారం తీర్పు వెల్లడించారు. న్యాయవాది కన్నోజు సునిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం నేరేడుపల్లికి చెందిన తాళ్లపల్లి సురేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో తన అవసరాల నిమిత్తం జిల్లా కేంద్రానికి చెందిన గండ్రకోట కుమార్ నుంచి రూ. 15 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీనికిగానూ సురేశ్ ఇచ్చిన చెక్ 2012లో బౌన్స్ అయ్యింది. దీంతో కుమార్ కోర్టును ఆశ్రయించాడు. మంగళవారం న్యాయవాది సునిల్‌కుమార్ బాధితుడు కుమార్ తరఫున వాదనలు వినిపించగా.. ఏకీభవించిన జడ్జి రామమోహన్‌రెడ్డి జైలు శిక్షతో పాటు, జరిమానా విధించారు. ఇదిలా.. ఉండగా.. కుమార్ తనకు జరిగిన న్యాయంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

25న పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

కాటారం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఈనెల 25న చైర్మన్ చల్ల నారాయణరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ ఎడ్ల సతీశ్ తెలిపారు. సంఘం అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు, రుణాల రికవరీ, మంజూరు, తదితర అంశాలపై సమావేశంలో చర్చించి పాలకవర్గ అనుమతితో తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని సీఈఓ కోరారు.

ఆరోగ్య మహిళా శిబిరాన్ని వినియోగించుకోవాలి



వెంకటాపురం: ఆరోగ్య మహిళా కార్యక్రమానికి హాజరైన మహిళలు, వైద్యురాలు

ఏటూరునాగారం: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ స్టేట్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఉన్న ఆకులవారి ఘణపురం 3 సబ్ సెంటర్‌లో ఆరోగ్య మహిళా శిబిరాన్ని సందర్శించారు. డాక్టర్ సుమలత 50 మంది మహిళలను పరీక్షించినట్లు వెల్లడించారు. వారికి ఉన్న వ్యాధులను గుర్తించి చికిత్సలు, మందులు ఉచితంగా అందజేసినట్లు పృథ్వీ వెల్లడించారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

వెంకటాపురం(కె): మండల పరిధి ఎదిర ఆస్పత్రిలో మంగళవారం 53 మంది మహిళలకు పరీక్షలు చేసినట్లు డాక్టర్ భవ్యశ్రీ తెలిపారు. 53 మంది మహిళల్ని స్క్రీనింగ్ చేయగా.. 13 మందికి రక్త పరీక్షలకు ములుగు టీ హబ్‌కు పంపించామన్నారు. 8 మంది మహిళలను ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశామన్నారు. ఆరోగ్య మహిళా క్లినిక్ స్టేట్ నోడల్ ఆఫీసర్ పృథ్వీ 8 రకాల పరీక్షల విషయాన్ని మహిళలకు వివరించారని తెలిపారు.



ఏటూరునాగారం: సబ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పృథ్వీ

బాలల పరిరక్షణ చట్టాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న రాంబాబు

ములుగు: బాలల పరిరక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్‌లైన్ టీం సభ్యుడు రాంబాబు అన్నారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని నవ భారతి మండల సమాఖ్య భవనంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు, లైంగిక దాడులు జరిగితే చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాల చట్టం 2006 ప్రకారం 18 ఏళ్లు నిండని వారికి వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో, కాలేజీలు, కమ్యూనిటీ లెవల్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం రవి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి హరికృష్ణ, సంధ్య, సీసీలు, ఏఓ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో విషాదం

వెంకటాపురం(కె): మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నేత పోలిన శ్రీనివాస్‌రావు మంగళవారం కారు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన స్వగ్రామం వెంకటాపురంలో విషాదం నెలకొంది. బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు, కూలీలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

27న వాహనాల వేలం

ములుగు: వినియోగంలో లేని 64 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను ఈ నెల 27న ములుగు మండలం జాకారంలోని డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రెనింగ్ కాలేజ్(డీటీసీ)లో వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలానికి వచ్చే వారు తమ వెంట ఆధార్ కార్డుతో పాటు వాహన భాగాలను విడిగా చేయడానికి కట్టర్‌తో ఉదయం 9గంటల వరకు డీటీసీలో హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 5వ వార్డుకు చెందిన రైతు జాడి రాజుకు చెందిన మూడు మేకలపై మంగళవారం సాయంత్రం కుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాలపాలైన మేకలు మృతి చెందాయి. తనకు రూ.20 వేలు నష్టం జరిగిందని, జీపీ అధికారులు, సర్పంచ్, పశుసంవర్ధకశాఖ అధికారులు తనకు పరిహారం అందించి ఆదుకోవాలని రాజు వేడుకుంటున్నాడు.

అప్పుల కుప్పగా ధనిక రాష్ట్రం

- ఎమ్మెల్యే సీతక్క



మచ్చాపూర్‌లో వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్(గోవిందరావుపేట): ధనిక రాష్ట్రమైన తెలంగాణను సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. ఈమేరకు మంగళవారం గోవిందరావుపేట మండలం ఫ్రూట్‌ఫారంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాంనాయక్ ఆధ్వర్యంలో చేపట్టిన గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమానికి సీతక్క హాజరై మాట్లాడారు. నిర్దిష్ట ఆర్థిక ప్రణాళిక లేని పథకాలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ సీఎం కేసీఆర్ సొంత ఆస్తులు కూడబెట్టుకుంటున్నారన్నారు. దేశం, రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి పైడాకుల అశోక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి సుధాకర్, జంపాల ప్రభాకర్, ఎంపీటీసీలు ఉమాదేవి–నరేందర్‌రెడ్డి, నాగలక్ష్మీ–అనిల్‌యాదవ్, ఏడుకొండలు, శ్రీనివాస్, హరిప్రసాద్, వెంకటకృష్ణ, సోమయ్య, విష్ణు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మంగళవారం మండలంలోని మచ్చాపూర్‌లో దెబ్బతిన్న వరి పంటను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. జిల్లాలో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ అధికారులచే నష్టపోయిన పంటలను అంచనా వేసి రైతులకు ఎకరాకు రూ. 20 వేల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల ప్రభాకర్, నారాయణ స్వామి, మల్లారెడ్డి, సంజీవ, సతీశ్, పూలక్క, లావణ్య, రమేశ్, కొమురయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళ మృతిపై విచారణ జరిపించాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కొప్పుల సరిత



మాట్లాడుతున్న సరిత

ఏటూరునాగారం: నిర్మల్‌లో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న జుగ్నక రేణుక మృతిపై న్యాయ విచారణ జరిపించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కొప్పుల సరిత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆసంఘ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం అగర్వడ గ్రామానికి చెందిన జుగ్నక రేణుక (27) కొన్నేళ్లుగా నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్ పని చేస్తోంది. ఈక్రమంలో ఆమెకు కొంత కాలంగా లావుడ్య రమేశ్ అనే వ్యక్తి పరిచయమై ప్రేమ పేరుతో ఆమెకు గర్భం చేశాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియకుండా గుట్టుచప్పుడు కాకుండా నడిపారు. ఆమె 8 నెలల గర్భిణీ కావడంతో కడుపు నొప్పి ఉందని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లడంతో ఆమె మృతి చెందింది. రేణుక మృతికి కారణమైన రమేశ్‌ను కఠినంగా శిక్షించి రేణుక కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ఏరియా ఆస్పత్రిలో వైద్యుల్ని నియమించాలి



మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బలరాం

- బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బలరాం

ములుగు రూరల్: ప్రభుత్వం ములుగు జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం అన్నారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో మౌలిక వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో టాయిలెట్స్ కంపు కొడుతున్నాయని, రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్యులు అందుబాటులో లేక రోగులను ఎంజీఎంకు తరలిస్తున్నారన్నారు. అర్హతల్లేని వారితో రక్త పరీక్షలు చేయిస్తూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వైద్యులు అందుబాటులో ఉండి ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేశ్ యాదవ్, కొత్త సురేందర్, రవీంద్రాచారి, భూక్య జవహర్‌లాల్, హరీశ్, లక్ష్మణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.